



కల్వకుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రం

ఉమ్మడి జిల్లాలో.. 5.47 లక్షల మందికి లబ్ధి

- రేపటి నుంచే రైతు రుణమాఫీ
- పంట రుణ ఖాతాలకు బదిలీ ప్రారంభం
- మొదట రూ.లక్షలోపు మాఫీ చేయనున్న ప్రభుత్వం
- ఇప్పటికే మార్గదర్శకాలు.. కుటుంబ గుర్తింపు కోసం రేషన్‌కార్డు
- రైతు వేదికల వద్ద ఎమ్మెల్యేల నేతృత్వంలో సంబురాలు



గుంటుక కొడుతున్న రైతు

మహబూబ్‌నగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న రైతుల పంట రుణ మాఫీకి ముహూర్తం ఖరారైంది. ఈ పథకం కింద ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5.47 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది. గురువారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న రైతుల రుణ ఖాతాల్లో నగదు బదిలీ ప్రారంభం కానుంది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రకటన చేశారు. జీవోఆర్‌టీ నెంబర్ 567 ద్వారా రుణమాఫీకి సంబంధించి సోమవారం మార్గదర్శకాలను విడుదల చేసిన ప్రభుత్వం.. వెనువెంటనే గురువారం నుంచి మాఫీని ప్రారంభించనున్నట్లు తెలిపింది. 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు తొమ్మిది వరకు రూ.రెండు లక్షలు రుణాలు ఉన్న రైతులందరికీ ఈ మాఫీ వర్తించనుంది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల్లో భాగంగా రైతు రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించింది. ఆ తర్వాత ప్రతిపక్షాలు మాఫీ ఎప్పుడు చేస్తారని ప్రశ్నిస్తున్న క్రమంలో.. పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చింది. ఆ సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి పాలమూరు వేదికగా ఆగస్టు 15 లోపు రైతు రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించారు. ఆ గడువులోపే మాఫీకి సంబంధించిన తేదీ ఖరారవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 2014, 2018 ఎన్నికల్లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా రైతు రుణాలను మాఫీ చేసింది. అయితే ఏకకాలంలో రుణమాఫీ చేయకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఐదేళ్ల కాలంలో విడతల వారీగా రూ.లక్ష లోపు రుణాలను మాఫీ చేసింది. అప్పటికే మాఫీకి ఆశపడిన రైతులకు.. రుణాలను రెన్యువల్ చేయకపోవడంతో అసలు కంటే వడ్డీ ఎక్కువ అయ్యాయి. దాంతో చేసిన రుణ మాఫీ కూడా వారికి మంచి ఫలాలను ఇవ్వలేదు. అయితే ఇప్పుడు ఏకకాలంలో రూ.రెండు లక్షల మేర రుణమాఫీ ప్రకటించడంతో చాలామందికి ఇబ్బందులు తప్పనున్నాయి. మాఫీ అయిన తర్వాత రైతులు తిరిగి రుణాలను తీసుకుని పంటల సాగు చేపట్టేందుకు అవకాశం ఏర్పడనుంది.

ఉమ్మడి జిల్లాలో 5.47 లక్షల మంది..

రైతు రుణమాఫీ పథకం కింద ఉమ్మడి పాలమూరు జిల్లాలో 5.47 లక్షల మందికి లబ్ధి చేకూరే అవకాశం ఉంది. మొత్తం ఐదు జిల్లాల్లో చిన్న, సన్నకారు రైతులు అధికంగా ఉన్నారు. వీరు గడిచిన ఐదేళ్లుగా పంటల సాగు కోసం వివిధ బ్యాంకుల వద్ద నుంచి రూ.రెండు లక్షల లోపు రుణాలను తీసుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 1.23 లక్షల మంది రైతులు పంట రుణాలను తీసుకున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో 95 వేల మంది, నారాయణపేట జిల్లాలో 94 వేల మంది, నాగర్‌కర్నూల్ జిల్లాలో 1.47 లక్షల మంది, వనపర్తి జిల్లాలో 88 వేల మంది రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారు. మొదట రూ.లక్ష లోపు రుణమాఫీ చేస్తుండటంతో మెజారిటీ రైతులకు గురువారం మాఫీ ఫలాలు దక్కనున్నాయి. వీరికి ఎంత మొత్తం మాఫీ అవుతుందనే విషయాలు మాత్రం అందుబాటులో లేవు. ఇప్పటికే ఆయా జిల్లాల నుంచి అర్హత సాధించిన రైతుల వివరాలను రాష్ట్ర అధికారులకు పంపించినట్లు లీడ్ బ్యాంక్ మేనేజర్లు స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం రుణ మాఫీ ఖాతాల్లో సొమ్ము బదిలీ చేయనున్నారు. ఆ తర్వాత రైతులు బ్యాంకులను సంప్రదించి.. వారి పాసు పుస్తకాలు తీసుకోవడమో లేదా తిరిగి కొత్త రుణాలు తీసుకోవడమో చేయనున్నారు. మాఫీ ప్రక్రియ గురువారం మొదలుపెట్టి.. నిర్దేశించిన గడువు ఆగస్టు 15 కంటే చాలారోజుల ముందుగానే పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కీలకమైన ఎన్నికల హామీని నెరవేర్చుతున్న నేపథ్యంలో రైతు వేదికల వద్ద గురువారం ఎమ్మెల్యేలు, మంత్రులతో సంబురాలు నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి కలెక్టర్ల సమావేశంలో తెలియజేశారు.

సందేహాల నివృతికి నోడల్ అధికారి నియామకం

రుణ మాఫీ పథకంలో భాగంగా రుణం పొందిన రైతు గుర్తింపు కోసమే రేషన్ కార్డును తీసుకోనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రేషన్ కార్డుకు పాసుపుస్తకమే ప్రామాణికమని కూడా తెలియజేశారు. గతంలో రుణమాఫీ పథకం కింద కేవలం అసలు మాత్రమే మాఫీ కాగా.. ఇప్పుడు రూ.రెండు లక్షల వరకు అసలు, మిత్తి కలిపి మాఫీ చేయనున్నారు. ఆపైన మిత్తి ఉన్న రైతులు మిగతా సొమ్మును చెల్లించిన తర్వాత మాఫీకి నగదు బదిలీ జరుగనుంది. గతంలో రూ.లక్ష లోపు రుణం తీసుకున్న రైతులకు మాఫీ చేయగా.. ఆ మీద ఉన్న రైతుల్లో కొంత మందికి రూ.లక్ష వరకు మాఫీ కాగా.. కొంతమందికి మొత్తమే మాఫీ కాలేదు. వారు ఇంకా బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. రుణమాఫీ ప్రక్రియ ప్రారంభమైన తర్వాత ప్రతీ బ్యాంకు ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమిస్తుంది. సదరు నోడల్ ఆఫీసర్‌ను సంప్రదించి.. రైతులు తమ రుణాలకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. రూ.రెండు లక్షల కంటే ఎక్కువ రుణం ఉన్న కుటుంబాల్లో మొదట మహిళల పేరు మీద ఉన్న రుణాలను ప్రభుత్వం మాఫీ చేయనుంది. ఒక్క కుటుంబంలో రూ.రెండు లక్షల వరకు రుణమాఫీకి అవకాశం ఉండనుంది. అలాగే రైతులు ఈ పథకంలో సందేహాలు, ఇబ్బందులను పరిష్కరించడానికి వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాల్సి ఉంటుంది. అధికారులు కూడా ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయనున్నారు. రైతులు ఇచ్చిన అభ్యర్థన లేదా ఫిర్యాదును 30 రోజుల్లోగా అధికారులు పరిష్కరించాల్సి ఉంటుంది.

రుణమాఫీతో భరోసా



రుణమాఫీ రైతుకు భరోసా నిస్తుంది. పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పులు తీరక, బ్యాంకులలో అప్పులు మిగిలాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి రుణమాఫీ చేస్తానని ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నారు. గత ప్రభుత్వం చేస్తానని మాట నిలబెట్టుకోలేదు. ఈ ప్రభుత్వంలో రైతులకు మేలు జరుగుతుందని భావిస్తున్నాము. రైతు భరోసా ఇస్తే పెట్టుబడులు పెట్టుకుంటాము.

- శ్రీనివాస్‌రెడ్డి రైతు, లత్తిపురం, గద్వాల జిల్లా

రైతు రుణమాఫీ చారిత్రాత్మకం



కాంగ్రెస్ ప్రభుత్వం ఏక కాలంలో రెండు రూ.లక్షల రుణమాఫీకి కసరత్తు చేయడం హర్షణీయం. రుణ మాఫీ వల్ల అప్పుల నుంచి రైతులు బయట పడతారు. వడ్డీతో కలిపి రెండు లక్షల రూపాయలు మాఫీ చేయడంతో రైతాంగానికి మేలు చేకూరుతుంది. వెనుకపడ్డ నారాయణపేట జిల్లా రైతాంగానికి ఆర్థికంగా చేయూత ఇచ్చినట్లు అవుతుంది.

- వెంకోబా, భారతీయ కిసాన్‌సంఘ్ రాష్ట్ర జోనల్ కార్యదర్శి, నారాయణపేట

సంతోషంగా ఉంది



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల సంక్షేమం కోసం పని చేస్తున్నాడు. ఏక కాలంలో రెండు లక్షల రూపాయల రుణాన్ని మాఫీ చేయడం సంతోషంగా ఉంది. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేశారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి చేస్తున్నాడు. నిజమైన రైతుకు ఎంతో సంతోషంగా ఉంది.

- యాదవరెడ్డి, రైతు, వేపూర్, హన్వాడ

రాష్ట్రంలోనే.. ముందంజ

- సాధారణ ప్రసవాల్లో కల్వకుర్తి సీహెచ్‌సీ మొదటి స్థానం
- ప్రైవేటుకు దీటుగా సేవలు

కల్వకుర్తి, జూలై 16: రాష్ట్రంలోని సీహెచ్‌సీల లో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రి సాధారణ ప్రసవాల్లో వరుసగా ప్రథమ స్థానంలో నిలుస్తోంది. ఎమర్జెన్సీ అయితే తప్ప.. ఇక్కడ నార్మల్ ప్రసవాలే చేస్తున్నారు. మొదటి కాన్పు చాలా వరకు సాధారణ ప్రసవాలే చేస్తుండటంతో ఈ ఆస్పత్రికి గర్భిణులు ఎక్కువ సంఖ్యలో వస్తున్నారు. ఇక్కడ రక్త, మూత్ర పరీక్షలతోపాటు స్కానింగ్ కూడా చేస్తున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం, గైనకాలజిస్టు డాక్టర్లు విజయ్‌కుమార్, సుష్మ, సివిల్ సర్జన్‌లు డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ యశోదబాయి, సిబ్బంది ప్రసవాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు గర్భిణులకు అవగాహన కల్పించడంతో పాటు దగ్గరుండి కాన్పుకోసం ఆస్పత్రికి తీసుకొస్తున్నారు. సాధారణ ప్రసవాలతో పాటు సిజేరియన్లు కూడా అధికంగా చేస్తున్నారు.



పరీక్షల కోసం ఆస్పత్రికి వచ్చిన గర్భిణులు

గత ఏడాది..

ఆస్పత్రిలో గత ఏడాది మార్చిలో 151 కాన్పులు చేయగా 91 నార్మల్, 60 సిజేరియర్ ప్రసవాలు చేశారు. ఏప్రిల్‌లో 164 కాన్పులకు 95 నార్మల్, 69 సిజేరియన్, మేలో 155కు 96 నార్మల్, 59 సిజేరియన్, జూన్‌లో 140కి 72 నార్మల్, 68 సిజేరియన్, ఆగస్టులో 141కి 64 నార్మల్, 77 సిజేరియన్ ప్రసవాలతో రాష్ట్రంలోనే మొదటి స్థానంలోనే నిలిచింది.

ఈ ఏడాది..

ఈ ఏడాది జనవరిలో 123 ప్రసవాలు చేశారు. అందులో సాధారణ కాన్పులు 64 కాగా, సిజేరియన్ 59 చేశారు. ఫిబ్రవరిలో 111కు 62 నార్మల్, 49 సిజేరియన్, మార్చిలో 147కు 72 నార్మల్, 65 సిజేరియన్, ఏప్రిల్‌లో 137కు 72 నార్మల్, 65 సిజేరియన్, మేలో 130కి 66 నార్మల్, 64 సిజేరియన్ కాన్పులతో ఈ సారి కూడా రాష్ట్రంలో ముందంజలో నిలిచిందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం తెలిపారు. అయితే జూన్‌లో ఎక్స్‌పెక్టెడ్ డేట్ డెలివరీలు తక్కువగా ఉండటంతో ఆ నెలలో 102 ప్రసవాలకు 50 నార్మల్, 52 సిజేరియన్ కాన్పులు అయినట్లు చెప్పారు. ఈ జూలైలో 15వ తేదీ వరకు 53 ప్రసవాలు కాగా, అందులో 34 సాధారణ కాన్పులు చేయగా, 19 మందికి సిజేరియన్ చేసినట్లు తెలిపారు.

నార్మల్ డెలివరీ అయ్యింది



నేను ప్రసవం కోసం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చాను. వైద్యులు నార్మల్ డెలివరీ చేశారు. అదే ప్రైవేట్ ఆస్పత్రికి పోతే.. ఆపరేషన్ చేస్తే డబ్బులు ఖర్చయ్యేవి.

- పూజ, పోల్కంపల్లి

మంచి వైద్యం అందించారు



ఆసుపత్రికి కాన్పు కోసం వచ్చాను. వైద్యులు, సిబ్బంది నార్మల్ డెలివరీ చేశారు. కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించారు. చాలా సంతోషంగా ఉంది.

- రామాంజ, చుక్కాపూర్

అందరి సహకారంతో..



అందరి సహకారంతో కల్వకుర్తి ఆస్పత్రిలో సాధారణ ప్రసవాల సంఖ్య పెరుగుతోంది. గైనకాలజిస్టులు, వైద్యులు, సిబ్బంది అందరం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. గర్భిణులకు రెగ్యులర్‌గా చెకప్ చేస్తూ.. డెలివరీకి ముందుగానే ఆస్పత్రిలో చేర్చుకుని వైద్యం అందిస్తున్నాం. జూన్‌లో ఎక్స్‌పెక్టెడ్ డేట్ డెలివరీస్ సంఖ్య(ఈడీడీ) తక్కువగా ఉండటంతో ప్రసవాల సంఖ్య తగ్గింది.

- డాక్టర్ శివరాం, ఆస్పత్రి సూపరింటెండెంట్

ఉమ్మడి జిల్లాలో జల్లులు

- వీడని ముసురు వాన
- కొల్లాపూర్‌లో 66.4 మిల్లీ మీటర్ల వర్షపాతం



వనపర్తి జిల్లా ఆత్మకూరులో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఆర్ఐ

మహబూబ్‌నగర్/గద్వాల/వనపర్తి అర్బన్, జూలై 16 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా మంగళవారం అక్కడక్కడా వర్షం కురిసింది. వనపర్తి జిల్లావ్యాప్తంగా మూడు రోజులుగా మోస్తరు వర్షం కురుస్తోంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం సాగు నేపథ్యంలో రైతులు ఇప్పటికే వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఆత్మకూరు పట్టణంలోని గొల్ల చెన్నమ్మ మట్టి మిద్దె పాక్షికంగా దెబ్బతిన్నది. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా తహసీల్దార్ రాజు, ఆర్ఐ జయమ్మ ఇంటిని పరిశీలించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామ చెప్పారు. వీపనగండ్లలో 62.2 మి.మీ., చిన్నంబావి 54.4, పెబ్బేరు 53.5, ఆత్మకూరు 48.0, శ్రీరంగాపూర్ 47.7, అమరచింత 43.5, పాన్‌గల్ 35.7, మదనాపూర్ 30.7, గోపాల్‌పేట 29.4, కొత్తకోట 27.9, వనపర్తి 26.3, పెద్దమందడి 23.7, రేవల్లి 19.2, ఘణపూర్ 8.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

- జోగుళాంబ గద్వాల జిల్లాలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారు జామున వరకు వర్షం దంచికొట్టింది. వర్షాకాలం ప్రారంభమైన తర్వాత జిల్లా అంతటా ఒకే విధంగా వర్షం కురవడం ఇదే మొదటి సారి, కేటీదొడ్డిలో 57.5 మిల్లీమీటర్లు, గద్వాల, ఉండవెల్లిలో 56.8, ఇటిక్యాలలో 52.5, మల్దకల్‌లో 51, గట్టులో 50, వడ్డేపల్లిలో 48.5, అలంపూర్‌లో 47.6, అయిజలో 44.5, మానవపాడులో 44.3, ధరూర్‌లో 39.8, రాజోలిలో 36 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. దీంతో కుంటలోకి
- పాలమూరు జిల్లాలో రోజంతా ఎండకాసినా సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మేఘావృతమై వర్షం కురిసింది. మంగళవారం సాయంత్రం 5 గంటల సమయంలో జిల్లా కేంద్రంలో అరగంటపాటు వాన కురిసింది. 2 సెం.మీ. వాన కురవడంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. అదే సమయంలో పాఠశాలలను వదలడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పిల్లలను ఇంటికి తీసుకెళ్ళడానికి తీవ్ర ఇబ్బంది పడాల్సి వచ్చింది. జిల్లా కేంద్రంలోని టీడీగుట్ట ప్రాంతంలో వర్షానికి ఓ మట్టి ఇల్లు కూలింది. ఇంట్లో వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. మునిసిపల్ అధికారులు వారిని పునరావాస కేంద్రానికి తరలించారు. భూత్పూర్ మండలంలో మోస్తారు వాన కురవగా, హన్వాడలో చిరుజల్లులు కురిశాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలో కొల్లాపూర్‌లో అత్యధికంగా 66.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. పెంట్లవెల్లిలో 38.2, కోడేరులో 21.0, పదరలో 18.2, లింగాలలో 12.6, నాగర్‌కర్నూల్‌లో 12.9, అమ్రాబాద్‌లో 10.4, వెల్దండలో 10.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 2.4 నుంచి 9.8 మిల్లీ మీటర్ల మధ్య వర్షం కురిసింది.

అమ్మో జ్వరం

- విష జ్వరాల బారిన జోగుళాంబ గద్వాల
- గ్రామాల కంటే పట్టణంలోనే ఎక్కువ మంది బాధితులు
- జిల్లా ఆస్పత్రికి రోజూ 15 మంది వరకు డెంగీ అనుమానితులు



డెంగీ అనుమానిత లక్షణాలతో జోగుళాంబ గద్వాల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు

గద్వాల న్యూటౌన్, జూలై 16: జోగుళాంబ గద్వాల జిల్లా ప్రజలు కొంత కాలంగా రోగాల బారిన పడుతున్నారు. డెంగీతో పాటు ఇతర వైరల్ జ్వరాల కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. గ్రామీణులకంటే పట్టణవాసులు అధికంగా బాధితులవుతున్నారు. పట్టణంలో డ్రైనేజీలను శుభ్రం చేయకపోవడం, చెత్తను తొలగించకపోవడంతో ఈగలు, దోమలు పెరిగి జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది.

15 రోజుల్లో నాలుగు కేసులు

గద్వాల జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి డెంగీ లక్షణాలతో వచ్చే రోగులు ఈ నెలలో పెరుగుతున్నారు. రోజూ 10 నుంచి 15 మంది దాకా అనుమానిత లక్షణాలు ఉన్నవారు వస్తున్నారని సిబ్బంది చెబుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో వారి సంఖ్య ఇంకా ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కేసులు గత ఏడాది ఏడు నమోదు కాగా, ఈ నెల 15వ తేదీ వరకు నాలుగు నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. అనధికారికంగా ఇంకా ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. అధికారులు ఎలిసా పరీక్ష ద్వారా నిర్ధారించినవి మాత్రమే పరిగణలోకి తీసుకోవడంతో డెంగీ బాధితుల సంఖ్య తక్కువగా ఉంటోంది. ప్రైవేట్ ఆస్పత్రులలో ఎలీసా ద్వారా కాకుండా ఇతర పద్ధతులతో నిర్ధారణ చేయడంతో కేసుల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ప్రైవేట్ ఆస్పత్రులు, ఆర్ఎంపీలు తమ వద్దకు వచ్చే డెంగీ బాధితుల వివరాలను గోప్యంగా ఉంచుతున్నారని సమాచారం. దాంతో ఈ కేసుల సంఖ్య ఎంత అనేది వైద్యాధికారులు తేల్చలేకపోతున్నారు. అధికారులు వారిపై పర్యవేక్షణ చేయకపోవడంతో ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది. ఆయా ఆస్పత్రులకు వచ్చిన రోగుల పరిస్థితి విషమిస్తే బయటకు పొక్కకుండా కర్నూల్, హైదరాబాద్ ఆస్పత్రులకు పంపిస్తున్నారు. పారిశుధ్య లోపమే కారణం పారిశుధ్య లోపం కారణంగా జిల్లా ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారు. పరిసరాలు శుభ్రంగా లేకపోవడం, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు క్లీన్ చేయకపోవడం, ఫలితంగా పగటి పూట కుట్టే దోమల వల్ల ప్రజలు డెంగీ బారిన పడుతున్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం కూడా ఒక కారణంగా తెలుస్తోంది. ఈ వర్షాకాలంలో కాచి వడపోసిన నీటినే తాగాలని, ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నీటిని ఎక్కువ రోజులు నిల్వ ఉంచుకోవద్దని అధికారులు చెబుతున్నారు. నాలుగు రోజులకు మించి జ్వరాలు ఉంటే.. వెంటనే ఆస్పత్రిలో చేరాలని సూచిస్తున్నారు. డెంగీ, దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహిస్తున్నామని అంటున్నారు. అందులో భాగంగా మలాథియాన్, పెరిత్రిన్, టిమిఫాస్ వంటి మందులను స్ప్రే చేస్తున్నామని తెలుపుతున్నారు.



డ్రైడే సందర్భంగా దోమల నివారణకు పైరతమ్ స్ప్రే చేస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే చికిత్స చేయించుకోవాలి



దోమలు, కలుషిత నీరు, కలుషిత ఆహారమే రోగాలకు కారణం. డెంగీ లక్షణాలుంటే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేరాలి. ప్లేట్‌లెట్స్ సంఖ్య 1.50 లక్షల నుంచి నాలుగు లక్షల దాకా ఉంటే నార్మల్‌గా నిర్ధారించొచ్చు. డెంగీ పాజిటివ్ ఉండి ప్లేట్‌లెట్‌ల సంఖ్య 50 వేలు ఉంటే చికిత్స చేయాలి. ఈ సమయంలో ప్రైవేట్ ఆస్పత్రుల వారు రోగులను భయభ్రాంతులకు గురి చేసి, డబ్బులు గుంజే అవకాశం ఉంటుంది. వారికి అవకాశం ఇవ్వకుండా ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే చికిత్స చేయించుకోవాలి.

- డాక్టర్ శశికళ, డీఎంహెచ్‌వో, గద్వాల

మాట నిలబెట్టుకోవాలి

- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ



సమావేశంలో మాట్లాడుతున్న డీకే అరుణ

మహబూబ్‌నగర్ (క్లాక్ టవర్), జూలై 16: ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు, రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, నిబంధనల పేరుతో రుణమాఫీకి తూట్లు పెడితే రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని వదిలేది లేదని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ జిల్లా స్థాయి కార్యకర్తల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం తప్ప ఏ ఒక్క హామీని కాంగ్రెస్ నెరవేర్చ లేదన్నారు. ఉచిత ప్రయాణంతో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, వారు తిడుతున్న తిట్లను మనమంతా గమనిస్తున్నామన్నారు. వరంగల్‌లో రైతు డిక్లేషన్ చేసినప్పుడు ప్రతీ రైతుకు రుణ మాఫీని చేస్తామని చెప్పి, ఇప్పుడు కండీషన్‌లు పెట్టడమేంటని ప్రశ్నించారు. కండీషన్లు పెట్టి, మాట నిలబెట్టుకోకుంటే బీజేపీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఎలాంటి నిబంధనలు లేకుండా ఆగస్టు 15 వరకు ప్రతీ రైతుకు రుణమాఫీ చేయాలన్నారు. కల్లబొల్లి మాటలు చెప్పి, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందాలని చూస్తుందని అన్నారు. అంతకు ముందు పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతూ వచ్చే స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలన్నారు. సమావేశంలో పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి చంద్రశేఖర్, రాష్ట ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పీ.శ్రీనివాస్ రెడ్డి, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న జిల్లా బాస్‌లు

హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంగళవారం నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో ఉమ్మడి జిల్లా బాస్‌లు పాల్గొన్నారు. ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి పలు అంశాలపై వారికి దిశానిర్దేశం చేశారు.





నారాయణపేట, జోగుళాంబ గద్వాల కలెక్టర్లు సిక్తా పట్నాయక్, బీఎం సంతోష్



మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిరబోయి





నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్, వనపర్తి ఇన్‌చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్

రేపట్నుంచి డీఎస్సీ పరీక్ష

- ఉమ్మడి పాలమూరు జిల్లాలో రెండు కేంద్రాలు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 16 : ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం నిర్వహించే డీఎస్సీ పరీక్షకు అన్ని ఏర్పాటు చేస్తున్నట్లు డీఈవో రవీందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఫాతిమా విద్యాలయం క్రిస్టియన్‌పల్లి, జయప్రకాష్ నారాయణ్ ఇంజనీరింగ్ కళాశాల ధర్మాపూర్‌లలో ఆన్‌లైన్ టెస్ట్ పరీక్ష ఉంటుందని తెలిపారు. ఈ పరీక్షలు 13 రోజుల పాటు, రెండు సెషన్‌లలో జరుగుతాయన్నారు. ఉదయం సెషన్ 9 గంటల నుంచి 11.30 వరకు, పీఈటీ, పీడీలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 వరకు, పీఈటీలకు, పీడీలకు మధాహ్నం 5 గంటల వరకు ఉంటుందన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి హాల్ టికెట్, ఐడీ ప్రూఫ్ తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలన్నారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం


కూలిన ఇంటిని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

దేవరకద్ర, జూలై 16 : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఇల్లు దగ్ధమైన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన తెలుగు యాదమ్మ, కుమారులు మంగళవారం ఇంటికి తాళం వేసి పనికి వెళ్లారు. మధ్యాహ్నం వేళ ప్రమాదవశాత్తు ఇంట్లో విద్యుదాఘాతంతో మంటలు చెలరేగి ఇంట్లో ఉన్న వస్తువులు దగ్ధమయ్యాయి. బీరువా, ఫ్రిజ్, నగదు, ఇతర వస్తువులు పూర్తిగా ధ్వంసమయ్యాయని, దాదాపు రూ. రెండు లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితులు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీనివాసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి పై అధికారులకు నివేదిస్తామన్నారు. ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు.

ఎమ్మెల్యే పరామర్శ

కాంగ్రెస్ కార్యకర్త కొండన్న ఇల్లు దగ్ధమవగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. డబుల్ బెడ్ రూం ఇల్లు మంజూరు చేస్తానని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, నాయకులు హన్మంత్‌రెడ్డి, అంజన్‌కుమార్‌రెడ్డి, రాజు, లక్ష్మారెడ్డి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నవాబ్‌పేట, జూలై 16 : ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ యువకుడు మృతిచెందిన సంఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన ఈసూరి యాదగిరి (23) మధ్యాహ్నం జిల్లా కేంద్రంలో పనులు ముగించుకుని తన ద్విచక్రవాహనంపై నవాబ్‌పేటకు వస్తుండగా మార్గమధ్యలో యన్మన్‌గండ్ల శివారులోని పెద్దగుండు సమీపంలో నవాబ్‌పేట నుంచి మహబూబ్‌నగర్ వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో యాదగిరి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, చికిత్స కోసం జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. యాదగిరి సోదరుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేపు ఎక్సైజ్ కార్యాలయంలో వేలంపాట

మహబూబ్‌నగర్, జూలై 16 : ఎక్సైజ్‌శాఖ అధికారుల దాడుల్లో పలు కేసుల్లో సీజ్ చేసిన మూడు ద్విచక్రవాహనాలకు గురువారం ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో వేలం పాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు వేలం పాటలో పాల్గొనాలని, వీరంతా ముందుగా రూ.2 వేల ధరావత్ చెల్లించి అనుమతి తీసుకోవాలని సూచించారు. జిల్లా ఎక్సైజ్ అధికారి సమక్షంలో వేలం పాట నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

బస్సు ఎక్కుతుండగా రూ. 50 వేలు చోరీ

జడ్చర్ల, జూలై 16 : ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా జేబులో ఉన్న రూ.50 వేలు చోరీకి గురైన సంఘటన జడ్చర్ల కొత్త బస్టాండులో చోటు చేసుకుంది. బాలానగర్ తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్ మంగళవారం సాయంత్రం జడ్చర్ల కొత్తబస్టాండులో రాణిపేట వెళ్లేందుకు బస్సు ఎక్కుతుండగా జేబులో ఉన్న రూ.50 వేలు గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. ఈ సంఘటనపై జడ్చర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు శ్రీకాంత్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం - కేసు నమోదు

జడ్చర్ల, జూలై 16 : జడ్చర్ల మండలం కిష్టారం గ్రామానికి చెందిన భాగం శివ అనే వ్యక్తి కనిపించడంలేదంటూ శివ సోదరుడు భాగం శ్రీశైలం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జడ్చర్ల ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. ఈ నెల 15న జడ్చర్లకు వెళ్లాడని, తిరిగి ఇంటికిరాలేదని, ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో మంగళవారం ఫిర్యాదు చేశాడని పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పార్కింగ్ చేసిన కారు టైర్లు చోరీ

జడ్చర్ల, జూలై 16 : జడ్చర్ల మండలం మాచారం గ్రామంలో ఇంటి ముందు పార్కింగ్ చేసిన కారు టైర్లు చోరీకి గురయ్యాయని కారు యజమాని నరేందర్‌రెడ్డి మంగళవారం జడ్చర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ నెల 15న రాత్రి 9గంటలకు ఇంటి ముందు కారును పార్కింగ్ చేశానని, మంగళవారం ఉదయం చూడగా కారుకు ఉన్న నాలుగుటైర్లు లేవని, గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారంటూ ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ శివానందం తెలిపారు. అలాగే జడ్చర్ల మునిసిపాలిటీ పరిధిలోని క్లబ్‌రోడ్డు ఇంటి ముందు పార్కింగ్ చేసిన మరో కారుకు ఉన్న నాలుగు టైర్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ అంశంపై బాధితుడు జడ్చర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు శ్రీధర్ తెలిపాడు.

బెదిరిస్తున్నారని నాయీ బ్రాహ్మణుడి ఫిర్యాదు

జడ్చర్ల, జూలై 16 : నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు బెదిరిస్తున్నారంటూ మంగలి శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జడ్చర్ల ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. జడ్చర్ల మునిసిపాలిటీలోని భవానీనగర్ కాలనీలో ఒక దుకాణం కిరాయికి తీసుకుని, మంగలిషాపు పెట్టుకున్నాడని, నాయీబ్రాహ్మణ సంఘం అనుమతి లేకుండా పెట్టవద్దని, దుకాణం నిర్వహించుకోవాలంటే సంఘానికి రూ.16వేలు ఇవ్వాలని హెచ్చరించారని ఫిర్యాదులో పేర్కొన్నాడని తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

టిఫిన్ సెంటర్ నిర్వాహకుడికి జరిమానా

జడ్చర్ల, జూలై 16 : జడ్చర్ల మునిసిపాలిటీలోని పలు హోటళ్లను మంగళవారం జడ్చర్ల మునిసిపల్ కమిషనర్ రాజయ్య తనిఖీలు నిర్వహించారు. జాతీయ రహదారిపై ఉన్న సింధూర టిఫిన్ సెంటర్‌లో తనిఖీ నిర్వహించిన ఆయన హోటల్‌లో అపరిశుభ్రంగా ఉండడంతో పాటు నాణ్యత లేకపోవడం కారణంతో రూ.3వేలు జరిమానా విధించారు. వర్షాకాలం సందర్భంగా డెంగీ, మలేరియా, కలరా వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని, హోటల్ పరిసరాలతో పాటు హోటల్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. నాణ్యమైన ఆహార పదార్థాలు పాటించని హోటల్స్‌పై రూ.50వేల వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. శానిటేషన్ అధికారి నాగేశ్, ఇన్‌స్పెక్టర్ శివకుమార్, జూనియర్ అసిస్టెంట్, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


జడ్చర్లలోని సింధూర హోటల్‌ను తనిఖీ చేస్తున్న మునిసిపల్ కమిషనర్

తల్లిదండ్రుల చెంతకు యువకుడు

- మతిస్థిమితం తప్పి రెండేళ్ల క్రితం అదృశ్యం - పశ్చిమ బెంగాల్ నుంచి రప్పించిన ఎమ్మెల్యే


గద్వాల న్యూటౌన్, జూలై 16 : మతిస్థిమితం తప్పి ఇంటి నుంచి వెళ్లిపోయిన యువకుడు, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి చొరవతో రెండేళ్ల తర్వాత తిరిగి తల్లిదండ్రుల చెంతకు చేరాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం చెన్నారెడ్డిపల్లి గ్రామానికి చెందిన రాములుకు ఇద్దరు కుమారులున్నారు. వారిలో పెద్ద కుమారుడు తిమ్మప్ప (24) రెండు సంవత్సరాల క్రితం మతిస్థిమితం కోల్పోయి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తల్లిదండ్రులు అతడి కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆశలు వదులుకున్నారు. కాగా ఇంటి నుంచి వెళ్లిపోయిన తిమ్మప్ప ఎక్కడెక్కడో తిరిగి చివరకు పశ్చిమ బెంగాల్ రాష్ట్రం, బంగ్లాదేశ్ సరిహద్దులోని మల్దా జిల్లాకు చేరుకున్నాడు. గడ్డం పెంచుకొని, జుట్టు విరబోసుకొని తిరుగుతున్న అతడిని ఓ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు తారశంకర్ చేరదీశాడు. ఆహారం అందించి సేవలు చేశాడు. అతడితో పలు రకాలుగా మాట్లాడి నెమ్మదిగా విషయాలను రాబట్టేందుకు యత్నించినా ఫలితం లేకపోయింది. కానీ తిమ్మప్ప కనీసం ఊరు పేరు, అమ్మ నాన్నల వివరాలు కూడా చెప్పలేకపోయాడు. కానీ మా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అని చెప్పాడు. దీంతో తారాసింగ్ గూగుల్‌లో పరిశీలించి, ఎమ్మెల్యేకు ఫోన్ చేసి వివరాలు చెప్పారు. దీంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే తిమ్మప్పకు సంబంధించిన వివరాలను ఆరా తీయించాడు. వాస్తవమని తేలడంతో సొంత ఖర్చుతో అతడిని బెంగాల్ నుంచి హైదరాబాద్‌కు విమానంలో రప్పించాడు. అక్కడి నుంచి తిమ్మప్పతో పాటు స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులను గద్వాలకు పిలిపించారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి, తిమ్మప్పను తండ్రి రాములుకు అప్పగించారు. ఇక రాడు అనుకున్న కన్నకొడుకును కళ్లారా చూసుకున్న తండ్రి రాములు తిమ్మప్పను అక్కున చేర్చుకున్నాడు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి రుణపడి ఉంటానంటూ కన్నీటి పర్యంతమయ్యాడు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తిమ్మప్పకు మెరుగైన వైద్యం అందించేలా చూస్తానని హామీ ఇచ్చారు. స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు తారాశంకర్‌ను ఘనంగా సన్మానించారు.



వివరాలు వెల్లడిస్తున్న తార శంకర్

కృష్ణమ్మ చెంతనే నీటికి చింత

పెంట్లవెల్లి, జూలై 16 : కృష్ణానది ఆధారంగా 30 సంవత్సరాల క్రితం ప్రారంభించిన మినీ ఎత్తిపోతల పథకాలు ఇప్పటికీ పూర్తి కాలేదు. దీంతో రైతులకు సాగునీరందడం లేదు. నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలం యంగంపల్లి, వెంకల్, మల్లేశ్వరం, జటప్రోల్ గ్రామాలకు కృష్ణానది పరివాహక ప్రాంతాలున్నాయి. యంగంపల్లి వద్ద చేపట్టిన మినీ ఎత్తిపోతల పథకం అసంపూర్తిగానే మిగిలిపోయింది. దీన్నినమ్ముకుని ఉన్న రైతుల ఆశలు ఆడియాశలుగానే మిగిలాయి. మల్లేశ్వరం, మాధవస్వామినగర్ గ్రామ శివారులో పంట పొలాలకు సాగునీరందించాలనే లక్ష్యంతో 1994 సంవత్సరంలో రూ.30 లక్షలు వెచ్చించి పనులు ప్రారంభించారు. దీంతోపాటు 1998లో వెంకల్ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. పనులు కొద్దిరోజులు సజావుగా సాగాయి. ఇందుకోసం కొన్ని మిషన్లతో పాటు పైపులైన్లు, విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. కానీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఎత్తిపోతల పథకాలు మధ్యలోనే అసంపూర్తిగా మిగిలిపోయాయి. 30 సంవత్సరాల క్రితం నిర్మించిన ఎత్తిపోతల పథకాలు కావడం.. ఎవరూ పట్టించుకోకపోవడంతో అక్కడ సామగ్రి, పైపులు, విద్యుత్ వైర్లు చాలావరకు వస్తువులు చోరీకి గురయ్యాయి. మినీ ఎత్తిపోతల పథకాలు అసంపూర్తిగా వదిలేయడంతో కృష్ణానది తీర ప్రాంతాల్లో ఉన్న గ్రామాల రైతులు సాగునీరందక వర్షాధారాన్నే నమ్ముకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పక్కనే కృష్ణానది ఉన్నా పంట పొలాలన్నీ బీడులుగా ఉంటున్నాయని.. వర్షం వస్తే తప్ప పంటలకు సాగునీరందడం లేదని వారు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి అసంపూర్తిగా వదిలేసిన మినీ ఎత్తిపోతల పథకాలను పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.



మాధవస్వామినగర్‌లో అసంపూర్తిగా ఉన్న మినీ ఎత్తిపోల పథకం

పనులు పూర్తి చేయాలి..



వెంకల్, యంగంపల్లి మినీ ఎత్తిపోతల పథకాలను ప్రభుత్వం వెంటనే పూర్తి చేసి రైతులకు సాగునీరందించాలి. వందలాది ఎకరాల్లో భూమి సాగులోకి వస్తుంది. పక్కనే నీరు పారుతున్నా పంటలు పండించుకోలేని స్థితిలో ఉన్నామని.. అధికారులు ఇప్పటికైనా చొరవ చూపి ఎత్తిపోతల పథకాలను పూర్తి చేయాలి.

- కుర్మయ్య, మల్లేశ్వరం

విద్యార్థులతో కళకళలాడుతున్న కస్తూర్బాలు

- 14 కేజీబీవీలు, 4,366 మంది విద్యార్థులు

- కోటాకు మించి చేరిన విద్యార్థినులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 16 : కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు (కేజీబీవీ) విద్యార్థినులతో కళకళలాడుతున్నాయి. గుణాత్మక విద్యాబోధన, నాణ్యమైన ఆహారం సురక్షితమైన ఆవాసాలు కలిగిఉన్న విద్యాలయాలపై విద్యార్థినుల తల్లిదండ్రులు మక్కువ చూపుతున్నారు. ప్రవేశ పరీక్ష లేకపోవడంతో కేజీబీవీలలో చేరడానికి విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. అక్కడ ఉన్న కోటాకు మించి విద్యార్థినులు చేరుతున్నారు. అయినా కూడా నిర్వాహకులు విద్యార్థినులను చేర్చుకుంటున్నారు. ప్రతీయేటా కేజీబీవీలకు మంచి డిమాండ్ పెరుగుతోంది. మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 14 కేజీబీవీలు ఉన్నాయి. ఇందులో ఇప్పటి వరకు 4,366 మంది విద్యార్థినులు చేరారు.

తల్లిదండ్రులు లేని పిల్లలకు మొదటి ప్రాధాన్యం :

అనాథ బాలికలకు విద్య అందించడమే లక్ష్యంగా 2007లో కేజీబీవీలను ప్రారంభించారు. 2009లో పూర్తి వినియోగంలోకి వచ్చాయి. అప్పట్లో చాలా మంది విద్యార్థులు మక్కువ చూపలేదు. అప్పట్లో విద్యార్థినులను చేర్పించేందుకు అప్పట్లో ప్రత్యేక అధికారులు, విద్యాశాఖ అధికారులు ఎంతో కృషి చేశారు. బడిమానేసిన, అనాథ పిల్లలను చేర్పించారు. అప్పట్లో ఈ పాఠశాలల్లో చేరాలంటే ఆసక్తి చూపేవారు కాదు. కేజీబీవీలు ప్రారంభమై ఏడాది, రెండేళ్ల తర్వాత విద్యార్థినుల సంఖ్య పెరుగుతూ వచ్చింది.

గత నాలుగైదేళ్లుగా కేజీబీవీలలో చేరేందుకు పోటీ పడుతున్నారు. ఈ ఏడాది మాత్రం విద్యార్థుల సంఖ్య అనుకున్నదాని కంటే చాలా వరకు పెరిగిందని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. విద్యార్థినుల ఎంపికలను కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలకు, సెమీ అర్బన్ పిల్లలకు మొదటి ప్రాధాన్యం ఇస్తారు. ఆతర్వత నిరుపేద బాలికలకు సీట్లుకేటాయిస్తారు.



మహబూబ్‌నగర్ రూరల్ మండల కోడూర్‌లోని కేజీబీవీ భవనం

జిల్లాలో 4,360 మంది విద్యార్థులు

మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 14 కేజీబీవీలు ఉన్నాయి. ఇందులో మొత్తం 4,360 మంది విద్యార్థినులు చదువుతున్నారు. ఇక్కడ 6 వతరగతి నుంచి 10 తరగతి వరకు చదువుతున్నారు. మొత్తం 14 కేజీబీవీలలో తొమ్మిదింటిలో ఆరు నుంచి ఇంటర్మీడియట్ వరకు ఉండగా, 5 కేజీబీవీలలో ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్నారు. వీరికి పుస్తకాలు, దుస్తులు, మూడు పూటలా భోజనంతో పాటు వసతి కల్పిస్తున్నారు. నాణ్యమైన విద్యనందిస్తున్నారు. 2023-2024 విద్యా సంవత్సరంలో జిల్లాలోని అన్ని కేజీబీవీలలో పది, ఇంటర్‌లో మంచి ఫలితాలు వచ్చాయి.

విద్యార్థినులకు మంచి విద్యనందిస్తున్నాం

కస్తూర్బా బాలికల విద్యాలయాల్లో విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన భోజనం అందుతుంది. గతేడాదితో పోలిస్తే అడ్మిషన్స్ చాలా పెరిగాయి. విద్యార్థినులకు విద్య అందించడంపై ప్రత్యేక అధికారులు, సీఆర్‌టీలు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.

- బైకాని బాలుయాదవ్, సెక్టోరియల్ అధికారి, మహబూబ్‌నగర్

నేడు వనపర్తికి సినీతార కుమారి వైష్ణవి చైతన్య రాక

వనపర్తి అర్బన్, జూలై 16: బేబీ సినిమా హీరోయిన్ కుమారి వైష్ణవి చైతన్య నేడు వనపర్తి జిల్లా కేంద్రానికి రానున్నారు. గత 40 సంవత్సరాలుగా వస్త్ర రంగంలో దూసుకెళ్తున్న చందన బ్రదర్స్ షాపింగ్, జ్యువెలరీ మాల్‌ను ఆమె ప్రారంభించనున్నారు. కొత్తకోట రోడ్డులోని రంగ థియేటర్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన షాపింగ్ మాల్‌ను ఉదయం 10:30 గంటలకు జ్యోతి ప్రజ్వలన చేసి ఆమె చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. ప్రారంభోత్సవ సందర్భంగా షాపింగ్ మాల్ నిర్వాహకులు పలు ఆఫర్లను కూడా ప్రకటించారు.



వనపర్తిలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న చందన బ్రదర్స్ షాపింగ్, జ్యువెలరీ మాల్

తాతపై మనుమడి దాడి, కేసు నమోదు

ఉప్పునుంతల, జూలై 16 : వ్యవసాయ భూమిని తన పేరుపై పట్టా చేయాలని తాతపై మనుమడు దాడి చేసిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం వెల్టూరు గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై లెనిన్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మల్లేపల్లి మల్లయ్యపై ఎనిమిదెకరాల వ్యవసాయ భూమి ఉంది. అయితే వ్యవసాయ భూమిని తన పేరుపై పట్టా చేయాలని మనుమడు మల్లేపల్లి ఆంజనేయులుతో పాటు, అతని భార్య కవిత, మల్లయ్య భార్య రాములమ్మలు ముగ్గురూ కలిసి మల్లయ్యపై మంగళవారం కర్రలతో దాడి చేసి గాయపర్చారు. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ముగ్గురిపై కేసు నమోద చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

బల్మూరు, జూలై 16 : నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం కొండనాగుల గ్రామ పంచాయతీ పరిధిలో గల పెద్ద గుడిబండలో ఉన్న శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపినట్లు ఆలయ చైర్మన్ కాట్రాజు తిరుపతయ్య స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఏఎస్సై రేణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. దాదాపు 300 సంవత్సరాల పూర్వం నుంచి ఉన్న ఆలయంలో గతంలో పలుమార్లు తవ్వకాలకు ప్రయత్నం చేసిన సంఘటనలు ఉన్నాయి. సోమవారం రాత్రి వర్షం పడడంతో ఆలయంలో ఎవరూ ఉండరనే ఉద్దేశంతో దుండగులు పెద్ద బండరాయిని తొలగించి, మట్టిని తవ్వారు. మంగళవారం ఆలయ పూజారి నిమ్మల రాజు ఆలయంలో పూజ చేయడానికి వెళ్లగా ఆవరణలో గుంతలు కన్పించడంతో వెంటనే చైర్మన్‌తో పాటు, పోలీసులకు సమాచారమందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆలయ ప్రాంగణంలో ఉన్న వేలిముద్రలను సేకరించారు. గుర్తు తెలియని వ్యక్తులు చేసిన పనిగా కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.



గుడిబండ శివాలయంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపిన దుండగులు

కులం పేరుతో కొట్టి, తిట్టిన వ్యక్తిపై కేసు నమోదు

బల్మూరు, జూలై 16 : కులం పేరుతో కొట్టి దుర్భాషలాడిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్సై రేణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం మహాదేవ్‌పూర్ గ్రామానికి చెందిన వెలికొండ వెంకటయ్య అదే గ్రామానికి చెందిన ద్యాసాని భాస్కర్‌రెడ్డి వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 13వ తేదీన భాస్కర్‌రెడ్డి వెంకటయ్యకు ఫోన్ చేసి పనికి రావాలని సూచించాడు. రెండు గంటలు ఆలస్యం కావడంతో భాస్కర్‌రెడ్డి వెంకటయ్య ఇంటికి వచ్చి భోజనం చేస్తున్న అతన్ని కొట్టాడు. అడ్డుకోబోయిన వెంకటయ్య భార్య తలకు తీవ్ర గాయమైంది. చుట్టుపక్కల వారు వచ్చి వారిని విడిపించారు. తన భర్తను కొట్టి, తనను గాయపర్చిన భాస్కర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం వెంకటయ్య భార్య తిరుపతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

ఉపాధ్యాయుల సర్దుబాటుకు చర్యలు

- ఆదేశాలు జారీ చేసిన డీఈవో ఇందిర

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అయిజ, జూలై 16 : ఆంధ్రజ్యోతి కథనానికి అధికారులు స్పందించారు. అయి. మండలంలోని కిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాలకు ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేశారు. వివరాలిలా ఉన్నాయి. కిష్టాపూర్ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా, వారిలో ఒకరు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో మరొకరు రావాల్సి ఉండగా, రాలేదు. దీంతో ప్రస్తుతం పాఠశాలలో ఒకే ఉపాధ్యాయుడు విధులు నిర్వర్తిస్తున్నారు. గత సోమవారం ఆ ఉపాధ్యాయుడు కూడా రాకపోవటంతో గ్రామస్థులు పాఠశాల ముందు నిరసన తెలిపారు. ఈ విషయంపై 'ఆంధ్రజ్యోతి'లో వార్త ప్రచురితం కావడంతో విద్యాశాఖ అధికారులు స్పందించారు. అతి త్వరగా పాఠశాలకు మరో ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేయాలని జిల్లా విద్యాధికారి ఇందిర ఉత్తర్వులు జారీ చేశారు. విద్యాబోధన సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని అయిజ మండల విద్యాధికారి నర్సింహులును ఆదేశించారు.

పంట కాలువ షట్టర్లు ధ్వంసం

మల్దకల్, జూలై 16 : జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలోని కుర్తిరావులచెర్వు గ్రామ సమీపంలో ర్యాలంపాడునుంచి నాగర్‌దొడ్డికి వెళ్లే కాలువకు షటర్లను గుర్తుతెలియని ధ్వంసం చేశారు. ఈ సంఘటనపై ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు సూర్యప్రకాష్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు కాలువ షట్టర్లను ధ్వంసం చేసి నాగర్‌దొడ్డి రిజర్వాయర్‌కు నీటిని మళ్లించారని ఆయన తెలిపారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు మల్దకల్ ఎస్ఐ తెలిపారు.

కుక్కల దాడిలో 58 గొర్రెలు మృతి

చిన్నంబావి, జూలై 16 : కుక్కల దాడిలో 58 గొర్రెపిల్లలు మృతి చెందిన సంఘటన మండలంలోని మియాపూర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. మియాపూర్ గ్రామంలో ఓడే రాములమ్మకు చెందిన 25 గొర్రె ప్లిలు గోపాల బిచ్చన్న కు చెందిన 10 గొర్రె పిల్లలు, గోపాల ఎల్లమ్మకు చెందిన 23 గొర్రె పిల్లలను కంచెలో వేసి, కంచె చుట్టు కంప ఏర్పాటు చేసి గొర్రెలను మేపుటకు వెళ్లగా, కంచె కిందిభాగం నుంచి కుక్కలు వచ్చి గొర్రె పిల్లలపై దాడి చేయడంతో 58 గొర్రె పిల్లలు మృతి చెందాయని బాధితులు తెలిపారు. మృతి చెందిన గొర్రె పిల్లల విలువ సుమారు రూ.5 నుంచి 7 లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు. ప్రభుత్వం తమకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితులు కోరారు.



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రె పిల్లలు

ఉపాధి కల్పించే కోర్సులను ప్రవేశపెట్టాలి



పాలెం డిగ్రీ కళాశాల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రొఫెసర్ డాక్టర్ కరుణసాగర్

- ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కరుణ సాగర్

బిజినేపల్లి, జూలై 16 : విద్యార్థులకు స్వయం ఉపాధి కల్పించే విద్యా కోర్సు ప్రవేశపెట్టి బోధించాలని ఉస్మానియా యూనివర్సిటీ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ కరుణసాగర్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం పాలెంలోని ఎస్వీ(శ్రీవేంకటేశ్వర) ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలోని సెమినార్ హాల్‌లో మంగళవారం అటానమస్ సక్సెస్ మీట్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ విద్యారాణి అధ్యక్షతన ఏర్పాటు చేయగా డాక్టర్ కరుణసాగర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కళాశాలను సద్వినియోగం చేసుకోవాలంటే మారుతున్న కాలానికి అనుగుణంగా కోర్సులను తీసుక రావాలని సూచించారు. అటానమస్ హోదాతో ప్రిన్సిపాల్‌తో పాటు కళాశాల సిబ్బందికి, పూర్వ విద్యార్థులకు, స్థానిక ప్రజా ప్రతినిధులకు బాధ్యత మరింత పెరిగిందని గుర్తు చేశారు. విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచుకొని ఇక్కడ చదివిన ప్రతీ విద్యార్థికి ఉపాధి లభించేలా, మెరుగైన అభ్యసన సాగేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అంతకుముందు పూర్వ విద్యార్థులు మాట్లాడారు. కళాశాలకు వచ్చే బడ్జెట్‌లో బాలికల హాస్టల్‌కు రూ.5.35 కోట్ల నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చిన కమిషనర్ దేవసేనకు పాలెం పూర్వ విద్యార్థుల సంఘం తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ విద్యారాణి మాట్లాడుతూ అందరి సహకారంతోనే కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా సాధించుకున్నామని, భవిష్యత్‌లో కళాశాల అభివృద్ధికి ప్రతీ ఒక్కరు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సుబ్బయ్య విద్యా సంస్థల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు బుడ్డయ్య, సభ్యులు పుప్పాల శ్రీనివాస్‌గౌడ్, కాశిరెడ్డి గోపాల్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, గంధం వెంకటేష్, డాక్టర్ అరవింద్, గాడి సురేందర్, అమర్ నారాయణచౌదరి, పూర్వపు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెబ్బేటి మల్లికార్జున్, కళాశాల నార్కోటిక్ లీగల్ అడ్వయిజర్ పూర్ణిమ, మాజీ సర్పంచ్ లావణ్యనాగరాజు, కొల్లాపూర్, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

లొద్దిమల్లయ్య దర్శనం అనుమతులపై నెలకొన్న సందిగ్ధత

మన్ననూర్, జూలై 16 : నాగర్‌కర్నూల్ జిల్లాలోని నల్లమల ప్రాంతంలో వెలసిన లొద్దిమల్లయ్య క్షేత్రానికి వెళ్లేందుకు అటవీ అధికారుల అనధికారిక అనుమతులతో భక్తులు సందిగ్ధంలో పడ్డారు. సోమవారం రాత్రి ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సైతం ఈనెల 16 నుంచి 18 వరకు మూడురోజుల పాటు లొద్ది మల్లయ్య జాతరకు అనుమతులు ఇవ్వాలని చరవాణిలో డీఎఫ్‌వో రోహిత్‌గోపిడీని కోరారు. అనుమతులు ఇస్తున్నట్లు హిందూ సంఘాలకు చెప్పినప్పటికీ అధికారికంగా మాత్రం అనుమతులు ఇస్తున్నట్లు ఎక్కడా పేర్కొనకపోవడం, పలు అటవీశాఖ సామాజిక మాధ్యమాల్లో లొద్ది మల్లయ్య జాతరకు అనుమతులు ఇవ్వలేదని వార్తలు చక్కర్లు కొడుతూ ఉండడంతో భక్తులు అయోమయంలో పడ్డారు. కాగా, తాము లొద్ది మల్లయ్య దర్శనానికి వెళ్లి తీరుతామని పలు హిందూ సంఘాల నాయకులు అటవీ శాఖకు సవాల్ చేయడంతో బుధవారం లొద్దిమల్లయ్య గేటు వద్ద ఎలాంటి పరిస్థితి ఉంటుందో వేచి చూడాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై అటవీశాఖ అధికారులను స్పష్టత కోసం చరవాణీల్లో విలేకరులు ప్రయత్నించినా స్పందించలేదు.

పాముకాటుతో యువకుడి మృతి

ఊట్కూర్/నర్వ జూలై 16: పాముకాటుకు గురైన యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని పులిమామిడి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. నర్వ మండలం లంకాల గ్రామానికి చెందిన బోడి తిరుపతమ్మ, బోడి హన్మంతు దంపతుల రెండవ కుమారుడు శివకుమార్(20) కొన్నేళ్లుగా పులిమామిడి గ్రామంలో తన మేనమామతో కలిసి ఉంటూ వ్యవసాయ పనుల్లో చేదోడువాదోడుగా ఉండేవాడు. సోమవారం సాయంత్ర కొట్టంలో ఎద్దులకు మేత వేసి ఇంటికి వచ్చాడు. అర్ధరాత్రి కడుపు నొప్పి అని బాధపడుతూ వాంతులు చేసుకున్నాడు. దాంతో కుటుంబికులు ప్రైవేట్ వాహనంలో నారాయణపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి మహబూబ్‌నగర్‌కు రెఫర్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా దేవరకద్ర సమీపంలో మృతి చెందాడు. మృతుడికి ఒక చెల్లి, అన్న మతిస్థిమితం లేని తండ్రి ఉన్నాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకొని ఆర్థిక సాయం అందించాలని గ్రామస్థులు కోరారు.



శివకుమార్ (ఫైల్)

గొర్రెల దొంగతనం.. ముగ్గురిపై కేసు నమోదు

బల్మూరు, జూలై 16 : వ్యవసాయ పొలంలో ఉన్న ఆరు గొర్రెలను దొంగిలించిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై రేణయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం మైలారం గ్రామానికి చెందిన పిల్లి మల్లయ్య ఈనెల ఐదో తేదీన తన వ్యవసాయ పొలంలోని దొడ్డిలో గొర్రెలను కట్టి ఇంటికి వచ్చాడు. మరుసటిరోజు ఉదయం వెళ్లి చూడగా గొర్ల మందలో ఆరు గొర్రెలు కన్పించకపోవడంతో వాటి జాడ కోసం వెతికాడు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో ముగ్గురు అనుమానితులు గడ్డం అన్వేష్, గడ్డం మల్లయ్య, గడ్డం శివ అనే వ్యక్తులు దొంగిలించినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

ఆల్మట్టికి పెరుగుతున్న వరద

- ఇన్‌ఫ్లో 1.04 లక్షల క్యూసెక్కులు

- అవుట్‌ఫ్లో 65 వేల క్యూసెక్కులు

గద్వాల, జూలై 16 : కర్ణాటక, మహారాష్ట్రలలో కురుస్తున్న వర్షాలకు కర్ణాటకలోని ఆల్మట్టి జలాశయానికి వరద పోటెత్తుతోంది. మంగళవారం సాయంత్రానికి 1,04,000 క్యూసెక్కుల వరద వచ్చిచేరుతోంది. దీంతో ఆల్మట్టి నిండుకుండలా నిండింది. పూర్తిస్థాయి నీటిమట్టం 129 టీఎంసీలు కాగా ప్రస్తుతం 100 టీఎంసీలకు చేరింది. పై నుంచి వరద భారీగా వస్తుండటంతో జలఉత్పత్తి ద్వారా 40 వేల క్యూసెక్కులు, 14 గేట్లను ఎత్తి మరో 25 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. నారాయణపూర్ జలాశయం పూర్తి సామర్థ్యం 37.64 టీఎంసీలు కాగా 28.76 టీఎంసీలకు నిల్వ చేరింది. ఇన్‌ఫ్లో 65 వేల క్యూసెక్కులు ఉండటంతో ఒక్కరోజులో నిండే అవకాశం ఉంది.

ఇప్పటికే జూరాల జలాశయం నిండి ఉండటంతో శ్రీశైలం వైపు కృష్ణమ్మ పరుగులు పెట్టే అవకాశం ఉంది. కృష్ణా పరివాహక ప్రాంతాలలో కురుస్తున్న వర్షాలకు శ్రీశైలానికి 2,496 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. కాగా కృష్ణానదికి ఉపనది అయిన తుంగభద్రకు వరద పెరుగుతోంది. తుంగభద్ర పూర్తిస్థాయి నీటిమట్టం 105.79 టీఎంసీలు కాగా ప్రస్తుతం 35.47 టీఎంసీలకు చేరుకున్నది. మంగళవారం 28,153 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు అవుతోంది.

ఆర్యవైశ్య మహాసభకు ఎన్నికలు నిర్వహించాలి

పాలమూరు, జూలై 16 : తెలంగాణ రాష్ట్రంలో ఆర్యవైశ్య మహాసభకు తొమ్మిదేళ్ల నుంచి ఎన్నికలు నిర్వహించటం లేదు. తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ విద్యా కమిటీ చైర్మన్, శ్రీశైలం మల్లికార్జున సత్రం అధ్యక్షుడు మిడిదొడ్డి శ్యాంసుందర్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్యవైశ్య హాస్టల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉమ్మడి జిల్లా కమిటీ ప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు. ఉప్పల్ బగాయత్‌లో ప్రభుత్వం ఆర్యవైశ్యులకు కేటాయించిన ఐదెకరాల స్థలం అభివృద్ధి ట్రస్టు ద్వారా కాకుండా మహాసభ నుంచే జరగాలన్నారు. ఆర్యవైశ్య మహాసభ బైలా ప్రకారం రెండేళ్లకోసారి ఎన్నికలు నిర్వహించి ప్రజాస్వామ్య బద్ధంగ కమిటి ఎంపిక వ్వాలన్నారు. అమరావతి లక్ష్మీనారాయణ ఉమ్మడి రాష్ట్రం నుంచి, రాష్ట్రాలు విభజన జరిగాక ఆయనొక్కడే అప్రజాస్వామ్య పద్ధతిలో ఉండటం సరికాదన్నారు. ప్రభుత్వం ఆర్యవైశ్యుల కోసం కేటాయించిన భూమి పేదలు, ఇతర కార్యక్రమాల కోసం మహాసభ ద్వారా అభివృద్ధి జరగటం సముచితమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి కాల్వ సుజాతను చైర్మన్ చేయటంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆవోపా రాష్ట్ర అధ్యక్షుడు మలిపెద్ది శంకర్, జిల్లా అధ్యక్షుడు పి.రామ్మోహన్, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, శంకు ఉమేష్, కల్వరాజు, మేడిశెట్టి బాలస్వామి, కొత్త శ్రీనివాస్‌గుప్తా, చంద్రకుమార్, బీమా ప్రభాకర్, సాయికిషోర్, చక్రధర్‌గుప్తా, వెంకటేశ్వర్లు, ఎదిరె ప్రమోద్‌కుమార్, సుజేంద్రశెట్టి, బల్ల శ్రీరాములు, కె.రమేష్, రామ్మోహన్, బాణాల సునీల్ కుమార్, శ్రీధర్, సురేష్, రవి కుమార్, కార్యదర్శులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

భారీ వర్షానికి దెబ్బతిన్న ఇల్లు

ఆత్మకూరు, జూలై 16: రెండు రోజులుగా ఆత్మకూరు మండ లంలో ముసురు వర్షాలు కురవడంతో పట్టణ కేంద్రంలోని గొల్ల చెన్నమ్మ ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్నది. ఈ విషయంపై తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయగా తహసీల్దార్ రాజు, ఆర్ఐ జయమ్మలు సందర్శించారు. ఆదివారం, సోమవారం గత రెండు రోజులుగా ముసురు వర్షాలు కురిసిన కారణంగా గోడలు కూలిపోయాయని తెలిపారు. కాగా గొల్ల చెన్నమ్మకు పక్కనే ఇల్లు ఉండడంతో ఆ ఇంటిలో నిద్రిస్తున్న సమయంలో గోడ కూలిపోయిందని తెలిపారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని సుమారుగా ఇంట్లోని వస్తువులు మంచం కలిపి పదివేల ఆస్తి నష్టం జరిగి ఉంటుందని తెలిపారు. అనంతరం తహసీల్దార్ రాజు మాట్లాడుతూ... వర్షాకాలం ప్రజలు అప్రమత్తంగా ఉం డాలని సూచించారు. మట్టి మిద్దెలు గుడిసెలలో ఉన్న వారు జాగ్రత్తలు పాటించాలని ముసురు వర్షానికి మట్టి మిద్దెలలో ఉండకుండా ప్రత్యామ్నాయం చూసుకోవాలని తెలిపారు.

సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యేతో చర్చలు

- ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డిని కలిసి మాజీ ఎంపీపీ శేఖర్‌రెడ్డి



ఎమ్మెల్యే జీఎంఆర్‌తో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి

భూత్పూర్, జూలై 16 : మండలంలోని వివిధ గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని మాజీ ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి స్థానిక ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డిని కోరారు. మంగళవారం మాజీ ఎంపీపీ మర్యాద పూర్వకంగా ఎమ్మెల్యేను కలిసి మండలంలో నెలకొన్న పలు సమస్యలపై మాట్లాడారు. మండలంలోని మద్దిగట్ల గ్రామంలో 80డబుల్ బెడ్‌రూము ఇండ్లు, అదే విధంగా కొత్తూరులో 40ఇండ్లు అసంపూర్తిగా ఉన్నాయని వాటిని వెంటనే పూర్తి అయ్యే విధంగా చూడాలని కదిరె శేఖర్‌రెడ్డి ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖ అధికారులతో, గుత్తేదారులతో ఎమ్మెల్యే మధుసూధన్‌రెడ్డి ఫోన్‌లో మాట్లాడారు. 30రోజుల్లో పెండ్సింగ్ ఉన్న పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. అదే విధంగా మండలంలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాల పనులను వెంటనే పూర్తి అయ్యేలా చూడాలని అధికారులను ఎమ్మెల్యే ఆదే శించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌వీసీ మిక్సింగ్ ప్లాంట్ యజమాని బాబు, గుత్తేదారులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మద్దిగట్లలో మొక్కలు పంపిణీ

భూత్పూర్, జూలై 16 : వన మహోత్సవంలో భాగంగా మండలంలోని మద్దిగట్ల గ్రామంలో మాజీ ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి పండ్లు, పూల మొక్కలను పంపిణీ చేశారు. మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో మొక్కల పంపిణీ అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ ఇంటి దగ్గర పూలు, పండ్ల మొక్కలను పెంచుకోవాలని ప్రజలకు సూచించారు. మండలంలో అన్నీ గ్రామాల్లో సుమారుగా మూడు లక్షల మొక్కలను నాటుతున్నట్లు వివరించారు. నాటి ప్రతీ మొక్కను బాధ్యతగా సంరక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గోపి, ఉపాధిహామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ఇచ్చిన మెమోలను వెనక్కి తీసుకోవాలి



జిల్లా అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

పాలమూరు, జూలై 16 : తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) మహబూబ్‌నగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఆందోళనలో భాగంగా సోమవారం ఎమ్మెల్యేల ఇళ్ల దగ్గర ధర్నా చేపట్టామని సరోజ, నల్లవెల్లి కురుమూర్తి, దీప్లానాయక్‌లు అన్నారు. మంగళవారం జిల్లా అధికారులకు సంఘం తరపున మెమోలను వెనక్కి తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు నేటి ప్రభుత్వమైనా అమలు చేయాలని రాష్ట్ర మంత్రి సీతక్కకు, జిల్లా స్థాయిలో పీడీలకు వినతిపత్రం అందజేశామన్నారు. సమస్యలు పరిష్కారం కాకపోవటంతోనే రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ధర్నా చేశామన్నారు. ఆందోళనలో పాల్గొన్న వారందరికి మెమోలు ఇవ్వటం సరికాదన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం విధిలేని పరిస్థితుల్లో ఆందోళన చేశామన్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ మోహన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వెంటకయ్య, వరద గాలెన్న, గోనెల రాములు పాల్గొన్నారు.

బోధనేతర సిబ్బందిని నియమించాలి



జడ్పీ సీఈవోకు వినతి పత్రం ఇస్తున్న ఎస్‌టీయూ టీఎస్ నాయకులు

మహబూబ్‌నగర్ టౌన్, జూలై 16 : ప్రభుత్వ పాఠశాలల్లో బోధనేతర సిబ్బందిని నియమించాలని ఎస్‌టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాహెర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సంఘం నాయకులతో కలిసి మహబూబ్‌నగర్‌లో జిల్లా పరిషత్ సీఈవో రాఘవేందర్‌రావుకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో లక్షల విలువైన ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పీ), డిజిటల్ ప్యానెల్ బోర్డులు, కంప్యూటర్లు, విలువైన ఫర్నిచర్ ప్రభుత్వం సమకూర్చిన సందర్భంగా ప్రతీ పాఠశాలకు వాచ్‌మెన్ కం స్వీపర్ అటెండర్ పోస్టులను మంజూరు చేసి, వాటిని భర్తీ చేయాలని కోరారు. సాధారణ బదీలీలలో గ్రామీణ ప్రాంత పాఠశాలలలో బోధనేతర సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని కోరారు. న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు మారేపల్లి శ్రీనివాస్, జిల్లా పరిషత్ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ మదన్ పాల్గొన్నారు.

రుణమాఫీ ప్రకటనపై కాంగ్రెస్ నాయకుల సంబురాలు

హన్వాడ, జూలై 16 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండు లక్షల రైతు రుణమాఫీ చేస్తున్నట్లు ప్రకటించడంతో మంగళవారం హన్వాడలో కాంగ్రెస్ నాయకులు రైతులకు స్వీట్లు పంచారు. ఒకరికొకరు స్వీట్ తినిపించుకున్నారు. ఏకకాలంలో రెండు లక్షలు మాఫీ చేయడం చరిత్ర కాంగ్రెస్‌దని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కృష్ణయ్య, మండల నాయకులు యాదవరెడ్డి, వి. కృష్ణయ్య, బాలయ్య, తిరుపతయ్య పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వన మహోత్సవం

మిడ్జిల్, జూలై 16 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వనమహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ శివకాంత్, ఎంపీడీవో గీతంజాలి, ఎంపీవో అనురాధతో పాటు వైద్యులు, సిబ్బంది మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాయన్న, ఎంఎహెచ్‌పీఎస్ వైద్యులు అనూష, సౌజన్య, శశాంక్, హెల్త్ అసిస్టెంట్లు దేవయ్య, జంగయ్య, సంపత్ కుమార్, ఏఎన్‌ఎం రాజేశ్వరి, బాలమణి, అంజమ్మ, గీత, తిరుపతమ్మ, పారిజాత, సిబ్బంది పాండు, వెంకటయ్య ఉన్నారు.

పుట్టినరోజు అందరికీ పండగే...



రవిరాథోడ్‌ను సన్మానిస్తున్న గిరిజన నాయకులు

పాలమూరు, జూలై 16 : పుట్టినరోజు అందరికి పండగే. కాని ఆరోజున పలువురి మన శక్తి మేరకు సహకారం, సంతోషం చెందేవిధంగా ఏదోఒక విధంగా సహకారం అందజేయాలని గిరిజన నాయకులు ఆర్.రమేష్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఏనుగొండ సాందీపని ఆవాసం, అనాథశర ణాలయం లో రవి రాథోడ్ జన్మదినం సందర్భంగా కేక్‌కట్ చేసుకోవటం సంతోషకరమన్నారు. జన్మదినం రోజుల బాలలకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. అనంతరం పలువురు గిరిజన నాయకులు మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే మార్గంలో పనిచేయటం అలవాటుగా మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో గిరిజన యువజన సంఘం అధ్యక్షుడు ఆర్.రవిరాథోడ్, కె.చందర్, పి.నరేష్, వి.పునీయ, యం.చందు, రాహుల్, వెంకటేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

పాములు... మానవ నేస్తాలు

- ప్రపంచ పాముల దినోత్సవం సందర్భంగా అవగాహన



పాముల గురించి వివరిస్తున్న ప్రొఫెసర్ డాక్టర్ సదాశివయ్య

జడ్చర్ల, జూలై 16 : పాములు... మానవ నేస్తాలని జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సదాశివయ్య సూచించారు. జడ్చర్ల పట్టణంలోని ఉదయ మెమోరియల్ హై స్కూల్, న్యూసన్ రైస్ స్కూల్స్‌లలో మంగళవారం ప్రపంచ పాముల దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతలో పాములకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉందని, ప్రకృతిలో ఓ భాగమేనని వివరించారు. విషసహిత, విష రహిత, అర్ధ విష సర్పాలు ఉంటాయని వివరిస్తూ వాటి గుర్తించే విధానం, లక్షణాలను వివరించారు. పాములు కాటు వేస్తే చేపట్టాల్సిన ప్రాథమిక చికిత్స, పాములలోని రకాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఉదయ మెమోరియల్ హైస్కూల్ కరస్పాండెంట్ వీణాశివకుమార్, రాంనాథ్, కీర్తన, సన్‌రైస్‌స్కూల్ కరస్పాండెంట్ అయూబ్‌ఖాన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తజన సంద్రంగా కోయిలకొండ

- బీబీ ఫాతిమా దర్శనం కోసం బారులు తీరిన భక్తులు
- ఉషాన్‌బాషా పీర్ల సవార్ల ఊరేగింపు
- నేడు అగ్నిగుండం, బీబీ ఫాతిమా పీరు ఊరేగింపు
- పీర్లను దర్శించుకున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

కోయిలకొండ, జూలై 16 : కోయిలకొండ వీధులు భక్తజన సంద్రంగా మారాయి. బీబీ ఫాతిమాపీరును దర్శించుకొనేందుకు మంగళవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. రాత్రికి అగ్నిగుండం, బుధవారం నాటితో పీర్ల పండుగ ముగుస్తుండడంతో భక్తులు వేలాదిగా తరలివచ్చారు. దారులు భక్తులతో నిండిపోయాయి. ఉన్నత పాఠశాల, పాత పోలీస్ స్టేషన్ తదితర ప్రాంతాల్లో భక్తులు భీమమ్మకు కందూర్లు నిర్వహించారు. మంగళవారం ఉషాన్‌బాషా, చాన్‌దూల పీర్లు ఖిల్లాలోని బీబీ ఫాతిమా పీరును దర్శించుకొని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. పీర్ల సవార్లు, అలయ్ ఆటలతో కోయిలకొండ వీధులు మార్మోగాయి.

నేడు అగ్నిగుండం, బీబీ ఫాతిమా ఊరేగింపు

బీబీ ఫాతిమా మొహర్రం ఉత్సవాల్లో ప్రధాన ఘట్టం అయిన అగ్నిగుండం, బీబీ ఫాతిమా పీరు ఊరేగింపు బుధవారం తెల్లవారు జామున నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు వేలాదిగా భక్తులు తరలివస్తారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేశారు. తెల్లవారు జామున మూడు గంటలకు ఖిల్లా నుంచి బీబీ ఫాతిమా పీరును కిందకు వస్తుంది. సాయంత్రం బీబీ ఫాతిమా పీరుతో పాటు ఆయా వీధుల్లో పీర్లు నిమజ్జనానికి తరలివెళ్తాయి.

బీబీ ఫాతిమాను దర్శించుకున్న ఎమ్మెల్యే

బీబీ ఫాతిమా మొహర్రం ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ఖిల్లాలోని బీబీ ఫాతిమాను దర్శించుకొని మొక్కులు చెల్లించుకొన్నారు. అంతకు ముందు పెద్దగౌని వద్ద గోలుసు వేసి ఖిల్లా చరిత్రను తెలుసుకొన్నారు. తెలంగాణలో ప్రసిద్ధి చెందిన బీబీ ఫాతిమా దర్శించుకోవడం సంతోషంగా ఉందని, ఎమ్మెల్యే అన్నారు. బీబీ ఫాతిమా మసీదు అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. పీర్ల పండుగలో ఎమ్మెల్యే పర్ణికారెడ్డి గాజులు వేసుకొని, తినుబండారాలు కొనుగోలు చేశారు. బీబీ ఫాతిమా నిర్వాహకులు ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విద్యాసాగర్‌గౌడ్ పాల్గొన్నారు.



భక్తులతో కిక్కిరిసిన కోయిలకొడ రహదారులు



బీబీ ఫాతిమా పీరును దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

శిథిలావస్థకు చేరిన ఇళ్లను ఖాళీ చేయించండి

- కూలిన ఇంటిని పరిశీలించిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- బాధితులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ



బాధితులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, జూలై 16 : కురుస్తున్న వర్షాలకు పాలమూరులో అక్కడక్కడా పాత ఇళ్లు కూలుతున్నాయని, అలాంటి వారికి పూర్తిగా అండగా ఉంటామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం కురిసిన వర్షాలకు 45వ వార్డులో ఓ ఇల్లు పూర్తిగా, మరో ఇల్లు పాక్షికంగా కూలిపోయింది. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే మునిసిపల్ అధికారులను ఘటనస్థలికి పంపించి వారిని పునరావాస కేంద్రానికి తరలించాలని ఆదేశించగా, వారిని టీడీ గుట్ట ఫైర్‌స్టేషన్ కమ్యూనిటీ హాల్ పునరావాస కేంద్రానికి తరలించారు. మునిసిపల్ కమిషన్ మహేశ్వర్‌రెడ్డి సిబ్బందితో అక్కడికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను పునరావాస కేంద్రానికి తరలించారు. అనంతరం ఎమ్మెల్యే అధికారులతో కలిసి కూలిన ఇంటిని పరిశీలించారు. అనంతరం పునరావాస కేంద్రానికి చేరుకుని బాధితులతో మాట్లాడి వారికి దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. భోజన వసతి కల్పించాలని అధికారులను ఆదేశించారు. పాలమూరు పట్టణంలో పుర అధికారులు శిథిలావస్థకు చేరిన ఇళ్లను గుర్తించి, అలాంటి ఇళ్లలో ఉండేవారిని వారిని ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. పునరావాస కేంద్రాలకు వారికి కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. బాధితులకు అన్ని రకాలుగా అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ నయాబ్, నాయకులు లక్ష్మణ్ యాదవ్, సాయిబాబ, మునీర్, చిన్న పాల్గొన్నారు.

ముదిరాజ్ కులాలను బీసీ డీ నుంచి ఏలోకి చేర్చాలి

- భూత్పూర్‌లో తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు



తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఫరీద్‌కు వినతి పత్రం అందజేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

భూత్పూర్, జూలై 16 : ఎన్నో ఏండ్లుగా అభివృద్ధిలో వెనుకబడి ఉన్న ముదిరాజ్ కులాల వారిని బీసీ డీ నుంచి బీసీ ఏగా మార్చాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్దవిజయ్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ముదిరాజ్ సంఘం నాయకులతో కలిసి మండల తహసీల్దార్ కార్యాలయం ముందు కొద్దిసేపు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఫరిద్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్ద విజయ్ పాత్రికేయులతో మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్న మా బతుకులు మారడం లేదని, రాష్ట్రంలో ముదిరాజ్, తెలుగు, ముత్తరాసి, బెస్త, గంగపుత్ర కులాలవారు పెద్ద సంఖ్యలో ఉన్నారని, అలాంటి మాకు రాజకీయంగా, విద్య, ఉపాధి, ఉద్యోగాల్లో సముచిత స్థానం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్యకారుల అభివృద్ధి కోసం కార్పొరేషన్ బోర్డును ఏర్పాటు చేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అదేవిధంగా మత్స్యకారులకు ప్రతీయేటా గత ప్రభుత్వం మాదిరిగా 100శాతం రాయితీపై చేప పిల్లలను పంపిణీ చేయాలని కోరారు. 50 సంవత్సరాలు నిండిన మత్స్యకారులకు పింఛన్ అందించాలని కోరారు. అదే విధంగా మత్స్యకారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు మనెమోని సత్యనారాయణ, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, మండల అధ్యక్షుడు గొడుగు వెంకట్‌రాములు, నాయకులు గోప్లాపూర్ సత్యనారాయణ, బోల వెంట్రాములు, వెంకటయ్య శ్రీశైలం, రాములు, జైదు శ్రీను, మల్లేష్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో పోచమ్మ అమ్మవారి బోనాలు



హన్వాడ : బోనాలతో వస్తున్న మహిళల ముందు గ్రామ పెద్దలు

హన్వాడ, జూలై 16 : చిన్నదర్పల్లి రెవెన్యూ వార్డు ప్రజలు మంగళవారం ఆషాడమాసం బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. బోనాలను కుంకుమ, పసుపు, వేపకొమ్మలతో అలంకరించి మహిళలు ఊరేగింపుగా వెళ్లి పోచమ్మ అమ్మవారి దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించారు. కౌన్సిలర్ లతాశ్రీ, లక్ష్మణ్ నాయక్, గ్రామ పెద్దలు కృష్ణకుమార్‌గౌడ్, హనుమంత్, రాజు, బాలరాజు, నారాయణ, వెంకటయ్య పెద్దలు మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీ బుచ్చన్న, మహిళలు పాల్గొన్నారు.



గండీడ్ : చెన్నాయిపల్లిలో బోనాలతో మహిళలు

గండీడ్ , జూలై 16 మండల పరిధిలోని చెన్నాయిపల్లి గ్రామంలో మంగళవారం పోచమ్మ దేవతకు మహిళలు బోనాలతో వెళ్లి టెంకాయలు కొట్టి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో ఉదయం నుంచి మహిళలు ప్రత్యేక పూజలు చేసి సాయంత్రం బోనాలతో అమ్మవారి దేవాలయానికి వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి పూజలు చేశారు. తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

పదవ తరగతి విద్యార్థుల హాజరు శాతం పెంచాలి

- పాఠశాల భవనాల మరమ్మతు పనులను పరిశీలించిన డీఈవో రవీందర్



కొత్తపేట పాఠశాలలో డిజిటల్ తరగతులను పరిశీలిస్తున్న డీఈవో

హన్వాడ, జూలై 16 : పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల హాజరు శాతం తగ్గకుండా చూడాలని డీఈవో రవీందర్ ఉపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం కొత్తపేట, టంకర జడ్పీహెచ్‌ఎస్, హన్వాడలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలను తనికీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి చదువు చెప్పాలన్నారు. విద్యార్థులకు సెలవులు ఇవ్వొద్దని ఖచ్చితంగా హాజరు అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. డిజిటల్ క్లాస్‌లు ఎలా చెప్పుతున్నారని విద్యార్థులకు అర్థమయ్యే విధంగా చెప్పాలని తెలిపారు. అనంతరం అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా జరిగిన పనులను పరిశీలించారు. ఆదేవిధంగా కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థునులతో మాట్లాడారు. శ్రద్ధగా చదువుకోవాలని కోరారు. హెచ్‌ఎం ఇందిరాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జడ్చర్ల అర్బన్ హెల్త్‌సెంటర్‌ను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



జడ్చర్ల అర్బన్ హెల్త్‌సెంటర్‌లో డాక్టర్ మనుప్రియతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

జడ్చర్ల, జూలై 16 : జడ్చర్ల అర్బన్ హెల్త్‌సెంటర్‌ను జిల్లా అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ మంగళవారం సందర్శించారు. అర్బన్‌హెల్త్‌సెంటర్ అందుతున్న వైద్యసేవలపై చికిత్స కోసం వచ్చిన వారితో ఆరా తీసారు. ఆసుపత్రిలో ల్యాబ్‌ను పరిశీలించి, మందులు అందుబాటులో ఉన్నాయనే అంశంపై అర్బన్ హెల్త్ సెంటర్ అధికారి డాక్టర్ మనుప్రియను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కావేరమ్మపేటలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ రాజయ్య తదితరులున్నారు.

టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో దేవతా వృక్షాలు నాటిన అధికారి



దేవతా వృక్షాలు నాటుతున్న దృశ్యం

మహబూబ్‌నగర్ టౌన్, జూలై 16 : స్థానిక టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో మంగళవారం దేవతా వృక్షాలను తిరుమల తిరుపతి హిందూ ప్రచార సమితి ఆధ్వర్యంలో నాటారు. ఆవరణలోని జమ్మి చెట్టు ఎండిపోవడంతో దసరా వరకు జమ్మి చెట్టు ఆవరణలో పూజ కార్యక్రమంలో ఉండాలని జమ్మి చెట్టుతో పాటు మిగతా దేవతా వృక్షాలను పూజలు నిర్వహించి నాటారు. ఈ కార్యక్రమంలో పాండురంగంతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

'ఆరు పథకాలను అమలు చేయాలి'

దేవరకద్ర, జూలై 16 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ (ఎమ్ఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకుడు సాంబశివుడు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మహిళలకు ఉచితబసు ప్రయాణం మాత్రమే అమలు చేశారని పేర్కొన్నారు. మిగిలిన తెల్ల రేషన్‌కార్డు, గృహపథకం, రైతు రుణమాఫీ, రైతు బంధు, ధరణి వంటి పథకాలను వెంటనే అమలు చేయాలని కోరారు.

చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించాలి

దేవరకద్ర, జూలై 16 : చిన్నారులను అంగన్‌వాడీ పాఠశాలల్లో చేర్పించాలని అంగన్‌వాడీ ఉపాధ్యాయులు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని అమ్మ మాట- అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా పట్టణ కేంద్రంలోని చిన్నారులతో కలిసి ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ చిన్నారులను ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించాలని, అంగన్‌వాడీ కేంద్రంలో ఆటపాటల ద్వారా విద్యను అందిస్తున్నామని పేర్కొన్నారు. చదువు, ఆనందంతో పాటు పిల్లలకు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా సెంటర్ల అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

21 వరకు గడువు పొడిగింపు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 16 : జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం ఈ నెల 21 తరకు దరఖాస్తు చేసకునేందుకు గడువు పొడిగించినట్లు డీఈవో రవీందర్ మంగళవారం ఒక ప్రకటలో తెలిపారు. 2024 జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం ఈనెల 21లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు వినియోగించుకోవాలని కోరారు.

నేడు పండుగ సాయన్న విగ్రహావిష్కరణ

హన్వాడ, జూలై 16 : మండల కేంద్రమైన హన్వాడలో బుధవారం 11 గంటలకు బహుజన వీరుడు పండుగ సాయన్న విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమం జరుగనున్నట్లు విగ్రహ ప్రతిష్ట కమిటీ సభ్యులు యాదయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మొహర్రంను తెలంగాణ సాంస్కృతిక పండుగగా గుర్తించాలి

- మొహర్రం నిర్వాహకుల సంఘం కన్వీనర్ జి.గట్టన్న

పాలమూరు, జూలై 16 : మొహర్రం (పీర్లపండుగ)ను రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ సాంస్కృతిక పండుగగా గుర్తించాలని పీర్ల పండుగ నిర్వాహకులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా పీర్లు కొలువుదీరాయి. గతంలో పీర్లచావిడికి మాన్యాలు ఉండేవని, అటువంటి భూములన్ని అన్యాక్రాంతమయ్యాయని పేర్కొన్నారు. పీర్ల పేరుమీద ఉన్న భూములను ఆక్రమించుకున్నవారు పీర్లపండుగ నిర్వహణకోసం ఎలాంటి ఖర్చు చేయటంలే దన్నారు. పీర్ల మాన్యాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని వాటిని పీర్లపండుగ నిర్వహణకు కేటాయించాలన్నారు. జిల్లా కేంద్రంలో బండ్లగేరి, పాతపాలమూరు, జైల్‌ఖానా, ఏనుగొండ, పాన్‌చౌరస్తా తదితర చోట్ల ఉన్న పీర్లను దర్శించుకుని పీర్ల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో మొహర్రం నిర్వాహకుల సంఘం కన్వీనర్ జి.గట్టన్న, టీఎఫ్‌టీయూ నాయకులు పి.విజయ్‌కుమార్, బాలకృష్ణ, జలాల్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీతో మాట నిలబెట్టుకున్నాం

- పేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి



మొక్కనాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

కోయిలకొండ, జూలై 16 : తెలంగాణలో రుణమాఫీ చేసి రైతులకు ఇచ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద వన మహోత్సవంలో మొక్కలు నాటి, ఎంపీడీవో కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసి చరిత్రలో నిలిచారని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు ఒక్కొటి అమలు చేస్తున్నారని వెల్లడించారు. ఉచిత బస్, విద్యుత్ అమలుతో ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. వన మహోత్స వంలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. గ్రామాల్లో బాల్య వివాహాలు చేయడం నేరమన్నారు. కల్యాణలక్ష్మి మంజూరుకు ఎవరూ డబ్బులు ఇవ్వరాదని తెలిపారు. మండలంలోని 90 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భరత్‌గౌడ్, ఎంపీడీవో కాళప్ప, కాంగ్రెస్ నాయకులు రవీందర్, విద్యాసాగర్‌గౌడ్, సత్యాపాల్‌రెడ్డి, రవినాయక్, రామస్వామి, శేఖర్, నాగరాజు, గౌస్, మనోజ్, విక్రమ్ పాల్గొన్నారు.

సామాజిక రుగ్మతల నిర్మూలన మన ఇంటి నుంచే మొదలు పెట్టాలి

పాలమూరు యూనివర్సిటీ, జూలై 16 : సామాజిక రుగ్మతలు మన నుంచి ప్రారంభం కావాలని పీయూ రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పీయూ లైబ్రరీ ఆడిటోరియంలో పీయూ సోషల్ వర్క్, ప్రవాహ ఆర్గనైజేషన్ సంయుక్తంగా నిర్వహించిన సామాజిక రుగ్మతలపై అవగాహన సదస్సు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆడపిల్లల పై వివక్ష తగదని, ఆడపిల్ల స్వేచ్ఛగా పనిచేసుకునే వాతావరణం కల్పించాలని తెలిపారు. పనిచేసే ప్రదేశాల్లో మహిళలపై జరిగే లైగింక వేధింపులు అరికట్టాలని అన్నారు. ప్రవాస్ ఆర్గనైజేషన్ వాళ్లు ఇలాంటి ఓపెన్ చర్చల ద్వారా విద్యార్థుల్లో ఆలోచన శక్తి పెరుగుతుందని, మహిళలను, ఆడపిల్లలను గౌరవించాలని, తద్వారా మహిళలు అన్ని రంగల్లో రాణిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ పర్వతాలు, కో కన్వీనర్ డాక్టర్ గాలెన్న, డాక్టర్ మాధవీమోహన్, డాక్టర్ చంద్రశేఖర్, పీఆర్‌వో డాక్టర్ రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.